క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేష పూజలు



సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

కంటి చూపు పట్ల నిర్లక్ష్యం వహించరాదు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాములపాడు: కంటి చూపు పట్ల నిర్లక్ష్యం వద్దని డాక్టర్ సుధాకర్‌రావు, రాఘవప్రీతమ్ సూచించారు. బుధవారం జూటూరు గ్రామంలో కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి చూపు లేకపోతే ఎంత కష్టంగా ఉంటుందో అనుభవించే వారికే తెలుస్తుందన్నారు. అనంతరం 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 25 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామక్రిష్టారెడ్డి, అబ్దుల్ హఫీజ్, నగేష్, తిరుపాలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌వీ మహేశ్వరరెడ్డి

పాములపాడు: స్థానిక మండల వ్యవసాయాధికారిగా ఎస్‌వీ మహేశ్వరరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి నందికొట్కూరు ఏట టెక్నికల్ అసిస్టెంట్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎమ్మిగనూరు అర్బన్ వ్యవసాయాధికారి ఎస్‌వీ మహేశ్వరరెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలకు స్వీకరించారు. దీంతో ఫణీశ్వరరెడ్డికి సిబ్బంది వీడ్కోలు పలికి నూతన ఏఓకు స్వాగతం పలికారు.

గుండెపోటుతో ఎమ్మార్పీఎస్ నాయకుడి మృతి



శ్రీశైలం ప్రాజెక్ట్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి శ్రీశైలం మండల నాయకుడు బూదాల ప్రేమ్‌కుమార్ (57) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. సున్నిపెంటలో బుధవారం ప్రేమ్‌కుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ప్రారంభం నుంచి ప్రతి ఉద్యమంలో ప్రేమ్‌కుమార్ చురుకుగా పాల్గొనేవారని వారు గుర్తు చేసుకున్నారు.

12, 13 తేదీల్లో బస్‌పాసుల కోసం రావద్దు



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం వినయ్‌కుమార్

ఆత్మకూరు: బస్‌పాస్‌ల కౌంటర్‌ను రెండు రోజులపాటు(12, 13 తేదీలు) మూసివేస్తున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ డీఎం వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ బస్‌పాస్‌లు మంజూరు చేసేందుకు కొత్త సాఫ్ట్‌వేర్ పునరుద్ధరణ చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం రెండు రోజులపాటు బస్‌పాస్‌ల జారీ నిలిపివేస్తున్నామని విద్యార్థులు గమనించి సహకరించాలని కోరారు. సమావేశంలో ఆర్టీసీ సీఐ కోటయ్య, ఎంఎం బాషా పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

వెలుగోడు: మండలంలో బోయరేవుల గ్రామంలో బుధవారం ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఇన్‌చార్జ్ మున్నంగి నాగరాజు మాదిగ మాట్లాడుతూ ఎమ్మెస్పీ గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎస్.ఎజ్రయ్య, అధ్యక్షుడిగా శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా విక్రమ్‌లతోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వాదం నాగేషులు మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి దరగయ్య మాదిగ, నాయకులు బి.ఆరోగ్యం, టి.వెంకటేశ్వర్లు, జి.నవీన్, వి.వెంకటరమణ పాల్గొన్నారు.



సీతాకోకలను పట్టుకునేందుకు యత్నిస్తున్న చిన్నారి



రంగులు వేరైనా మన దంతా ఒక కుటుంబమే

పుడమి తల్లికి సీతాకోకలు

వర్షాకాలం వస్తే చాలు సీతాకోకచిలుకలు సందడి చేస్తుంటాయి. గుంపులుగా చేరి కనువిందు కలిగిస్తుంటాయి. రెక్కలు విప్పి విహరిస్తున్న సమయంలో వాటి అందాలు అన్నీఇన్నీ కావు. ఎక్కడ తేమ ఉంటే అక్కడికి రెక్కలు ఎగరేసుకుంటూ వాలిపోతున్నాయి. మహానందిలోని నాగనంది వసతి సముదాయం వద్ద బుధవారం పుడమితల్లిని స్పర్శిస్తూ సందడి చేస్తున్న సీతాకోకలను 'సాక్షి' కెమెరాలో బంధించింది. – మహానంది



పూటకు ఆహారం దొరికిందోచ్..

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీశైలం ఈఓ, సీఐ

- శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా నేటి యువతరం, విద్యార్థులు ముందుకు సాగాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో మల్లికార్జున కల్యాణ మండపంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడుతున్న వారు తమ జీవితాలతోపాటు కుటుంబాలను కూడా నాశనం చేస్తున్నారన్నారు. సీఐ జి.ప్రసాదరావు మాట్లాడుతూ డ్రగ్స్ ఎవరైనా రవాణా చేసినా, అమ్మినా, వాడినా ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. అనంతరం డ్రగ్స్ నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్నూలు ఈగల్ సెల్ ఎస్‌ఐ సృజన్ పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి

అత్మకూరు: బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీ సంక్షేమ సంఘం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షులు వెంకటస్వామిగౌడ్ సూచించారు. పట్టణంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నంద్యాల మార్క్‌ఫెడ్ సొసైటీ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావుయాదవ్ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలన్నారు. కులగణన ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలన్నారు. బీసీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. అంతకుముందు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం నాగేశ్వరరావుయాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు వేంపెంట రాంబాబు, గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అయ్యన్న యాదవ్, బీసీ సంఘం నాయకులు పెద్దన్న, వెంకటన్న, కురుకుంద ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరయాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

గురువుకు సత్కారం



తిరుపతయ్యను సన్మానిస్తున్న శిష్య బృందం

నందికొట్కూరు: పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో వెలిసిన వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం డోలు విద్యాదాన కర్త, డోలు లయ, జ్ఞాన జ్యోతి ఆంధ్ర స్టార్ అవార్డు గ్రహీత, ఆల్ ఇండియా రేడియో, టీవీ గ్రేడ్–1 ఆర్టిస్ట్ నందికుంట తిరుపతయ్యను 250 మంది శిష్యులు సన్మానించారు. అతిథిగా హాజరైన జాతీయ సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు ఎల్‌వీ చెన్నారావు మాట్లాడుతూ తిరుపతయ్య రేడియో, టీవీలలో డోలు వాయించడంలో చక్కటి ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకోవడమే గాక వందల మందికి తన కళను నేర్పించారన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు రంగస్వామి పాల్గొన్నారు.

ప్రింట్ కోసం పరుగో పరుగు!

- సచివాలయాల్లో పనిచేయని ప్రింటర్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

వెలుగోడు: కొన్ని రోజులుగా పట్టణంలోని మూడు, నాలుగు సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయడం లేదు. దీంతో కులం, ఆదాయ, తదితర సర్టిఫికెట్ల కోసం వచ్చే వారు ప్రింట్ కోసం బయటకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. సచివాలయాల్లో ప్రింట్ రాకపోవడంతో ప్రజలపై అదనపు భారం పడుతోంది. సచివాలయం సిబ్బంది అప్లికేషన్ రిజిస్టర్ చేసిన తర్వాత చెక్‌లిస్ట్ కూడా బయట తెచ్చుకోవాల్సి వస్తుంది. రెవెన్యూ కార్యాలయంలో వెరిఫికేషన్ తరువాత సచివాలయంలో సర్టిఫికెట్ కోసం వెళ్తే ప్రింటర్లు పనిచేయడం లేదు. పీడీఎఫ్ పంపించి బయట తీసుకోమంటున్నారు. ఒక వేళ తమకు అదనపు భారం కదా అని ప్రశ్నిస్తే, ప్రింటర్ పనిచేసే 2, 5వ సచివాలయల్లో తీయించుకోమని ఉచిత సలహా ఇస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు తెరిచే సమయంలో ప్రింటర్లు పనిచేయకపోవడంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓడ మధుసూదనరెడ్డిని వివరణ కోరగా త్వరలో ప్రింటర్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



వెలుగోడులోని సచివాలయం

అందరికీ విద్యా కిట్లు

మహానంది: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏపీ మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ రవిసాగర్ సూచించారు. తిమ్మాపురం గాజులపల్లె పాఠశాలలో రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్లను బుధవారం పరిశీలించారు. గురువారం ఉదయం అన్ని ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో విద్యార్థి మిత్ర కిట్లను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామసుబ్బయ్య, పరిశీలకులు శరత్ బాబు పాల్గొన్నారు.

భక్తులకు జలప్రసాదం

సాక్షి ఎఫెక్ట్

మహానంది: మహానందిలోని చిన్న గేటు వైపు ఉన్న జలప్రసాదం కేంద్రానికి దేవస్థానం అధికారులు మరమ్మతులు చేశారు. ఈనెల 8న సాక్షిలో ×దాహం..దాహం¥ శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి.. దివీస్ లాబోరేటరీ వారు నిర్మించిన జలప్రసాదం కేంద్రానికి మరమ్మతులు చేయించారు. దీంతో భక్తులు దేవస్థానం అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



జలప్రసాద కేంద్రం వద్ద నీళ్లు పట్టుకుంటున్న భక్తులు

నేడు ఆల భూములకు వేలం

బండిఆత్మకూరు: మండలంలోని దేవదాయ భూములకు గురువారం కౌలు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు గ్రూపు దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగప్రసాద్ బుధవారం తెలిపారు.

వంతెన నిర్మాణానికి భూమి పూజ

వెలుగోడు: పట్టణ శివారులోని మంచినీళ్ల వాగుపై వంతెన నిర్మాణానికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. సుమారు రూ.1.90 కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సకాలంలో పనులు చేపట్టి పట్టణ ప్రజలకు వంతెనను అందుబాటులోకి తెస్తామన్నారు.

దరఖాస్తు చేసుకోండి

వెలుగోడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి 7, 8, 9వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నలిని సూచించారు. బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 7లో రెండు, 8, 9 తరగతుల్లో ఒక్కో సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని సిద్దేశ్వరంపేట కాలనీకి చెందిన రైతులు బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కాలనీలో వెలసిన నాగిరెడ్డిస్వామికి పూజలు చేసి ఈ ఏడాది ఖరీఫ్ కలిసి రావాలని కోరుకున్నారు.

వార్డెన్ల బదిలీ

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని ఎస్సీ వసతి గృహాల వార్డెన్లు బదిలీలు బుధవారం జరిగాయి. మండలంలోని వెంకటాపురం ఎస్సీ వసతిగృహం వార్డెన్ అంకన్నను వెలుగోడు మండలం వేల్పనూరు ఎస్సీ వసతి గృహానికి, వేల్పనూరు వార్డెన్ చిట్టిబాబును వెంకటాపురం వసతిగృహానికి, ఆత్మకూరు బాలికల వసతిగృహం వార్డెన్ అమ్మనిబాయిని నంద్యాల ఎస్సీ వసతిగృహానికి, అక్కడ విధులు నిర్వహిస్తున్న సుధారాణిని ఆత్మకూరు ఎస్సీ వసతిగృహానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ

పాములపాడు: మండలంలోని క్రిష్టారావుపేట గ్రామం నుంచి తుమ్మలూరు గ్రామానికి బీటీ రహదారి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.34.50లక్షలతో బీటీ రహదారి పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. కాగా నేషనల్ హైవే 340 సీ నిర్మాణంలో భాగంగా క్రిష్టారావుపేట గ్రామంలోని సర్వీసు రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో సమస్యగా మారిందని సర్పంచు వరప్రసాదరావు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. హైవే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కేజీబీవీ గదుల నిర్మాణానికి..

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని కేజీబీవీ డార్మెట్రీ, హాస్టల్ గదుల నిర్మాణాలకు నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డివిజన్ ఇంజినీర్ ధనిబాబు, ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, ఈఓపీఆర్‌డీ నాగేంద్రయ్య, నందికొట్కూరు మార్కెట్ చైర్మన్ ప్రసాదరెడ్డి, సర్పంచ్ శేషమ్మ పాల్గొన్నారు.

అర్హులైన వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండి

కొత్తపల్లి: అర్హులందరికీ గృహాల మంజూరు కోసం పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో 850 మందికి పైగా నూతన గృహాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో 250 మంది మాత్రమే పొజిషన్ సర్టిఫికెట్లు పొందారన్నారు. మిగిలిన వారిలో అర్హులను గుర్తించి వారికి కూడా వెంటనే పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలన్నారు.

మోగనున్న బడి గంట

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం



పాములపాడు జిల్లా పరిషత్ హైస్కూల్

నందికొట్కూరు: ఆట పాటలకు ఇక సెలవు. వేసవి సెలవులను ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపిన పిల్లల వీపుపై మంగళవారం నుంచి మళ్లీ పుస్తకాల మోత పడనుంది. ఇన్నాళ్లకు 6 గంటల తరువాత నిద్ర లేచి అమ్మ ఇప్పుడు వేకుజామునే మేల్కోవాలి. పిల్లలకు స్నానం చేయించి, టిఫిన్ భోజనం వండి క్యారియర్లల్లో సర్దాలి. అనంతరం ముస్తాబ్ చేసి బడికి పంపాలి. నాన్న వారిని వాహనంపై ఎక్కించుకుని హడావిడిగా బడి వద్ద దింపి రావాలి. దాదాపు 50 రోజుల పాటు ఆగిపోయిన ఈ ఆడావిడి మళ్లీ గురువారం నుంచి ప్రారంభం కానుంది. కాగా నియోజకవర్గంలో పాఠశాలలు తెరుచుకుంటున్నా పూర్తిస్థాయిలో పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేయలేదు. నందికొట్కూరు పట్టణం, మండలంలో 55, పగిడ్యాల మండలంలో 29, మిడుతూరు మండలంలో 45, జూపాడుబంగ్లా మండలంలో 35, పాములపాడు మండలంలో 41, కొత్తపల్లి మండలంలో 42 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం విద్యార్థుల సంఖ్య 40,745 మంది ఉన్నారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లను నిర్మించలేకపోయారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు ఏడాది గడుస్తున్నా కాగితాలకే పరిమితమయ్యాయి.

విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: కిశోర బాలికలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్యవివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కౌమార దశలో పౌష్టికాహారం తీసుకోవాలరు. బాలల హక్కులు, బాలల అక్రమ రవాణా, పోషకాహారం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామ్‌నాయక్, హెల్త్‌ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి పంటలను సాగు చేసుకోవాలని కేవీకే శాస్త్రవేత్త రమణయ్య రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని దుద్యాల గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలన్నారు. పంట దిగుబడి సాధించేందుకు రసాయానిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్నారు. అనంతరం పంటల సాగు, జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానాధికారి చందన, ఉపసర్పంచు మన్సూర్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ, వ్యవసాయ సహాయకులు శేషు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట నిరసన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి యువజన సంఘాల నాయకులు

నందికొట్కూరు: విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడంపై ఈనెల 13న నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు సురేష్ యాదవ్, మాధురి తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు భృతికి ఊసే ఎత్తడం లేదన్నారు. హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగులు తరలిరావాలని కోరారు. సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు లడ్డు, అబ్దుల్లా పాల్గొన్నారు.

- ఆత్మకూరు: ఈనెల 13న నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు దర్గా రియాజ్‌బాషా కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారం లోకి వచ్చి ఏడాది అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించకపోవడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు.

హంద్రీనీవా విస్తరణ పనులపై విచారణ చేపట్టాలి



హంద్రీనీవా విస్తరణ పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: హంద్రీనీవా కాలువ విస్తరణ పనులపై జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. బుధవారం మల్యాల హంద్రీనీవా కాలువ విస్తరణ పనుల నాణ్యతను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్యాల నుంచి అనంతపురం జిల్లా వరకు జరుగుతున్న హంద్రీనీవా విస్తరణ పనులు అవగాహన లేని సబ్ కాంట్రాక్టర్లు చేస్తుండటంతో వారు నాణ్యతకు తిలోదకాలిచ్చారన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం పలు విమర్శలకు దారితీస్తుందనా్రను. సబ్ కాంట్రాక్టర్లను తొలగించి మేగా కంపెనీతోనే పనులు చేయించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాల సాధన కోసం ఈనెల 16న సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ కోరారు. బుధవారం వారు పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పేదలకు మూడు సెంట్ల స్థలం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు సెంటున్నర అంటూ మాట మార్చడం తగదన్నారు. కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, నాగేశ్వరరావు, గణపతి, శీను, మద్దిలేటి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ చర్యలతో నీటి సమస్య



నిరుపయోగంగా మారిన ఓవర్‌హెడ్ ట్యాంక్

పగిడ్యాల: విద్యుత్ లైన్ కాంట్రాక్టర్ చేష్టలతో మండల పరిధిలోని పడమర వనుముల పాడు గ్రామస్తులకు నీటి సమస్య తలెత్తింది. త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ కోసం స్తంభాలను ఇష్టానుసారంగా పాతించడంతో తాగునీటి పైప్‌లైన్ ధ్వంసమైంది. పైప్‌లైన్‌ను పునరుద్ధరించాల్సిన కాంట్రాక్టర్ అలాగే వదిలేయడంతో 20 రోజులుగా గ్రామస్తులు నీటి సమస్యతో అల్లాడిపోతున్నారు. దాదాపు 1500 పైగా జనాభా ఉన్న గ్రామంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. అయితే విద్యుత్ లైన్ కాంట్రాక్టర్ చేసిన పొరపాటు గ్రామస్తులకు శాపంగా మారింది. ఇరవై రోజుల క్రితం ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీటి సరఫరా అయ్యే పైప్‌లైన్ ఉన్న చోట విద్యుత్ స్తంభాలు పాతేందుకు కాంట్రాక్టర్ గుంత కొట్టడంతో పైప్‌లైన్ ధ్వంసమైనట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే అటు కాంట్రాక్టర్ కానీ ఇటు పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. పాత ముచ్చుమర్రి గ్రామానికి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. మండల అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.